సాక్షి
జోగుళాంబ గద్వాల
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



నిలకడగా ఇన్‌ఫ్లో
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది.
వివరాలు 8లో ▸



నేతన్నకు గౌరవం
కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు 5 మంది నేత కార్మికులు ఎంపికయ్యారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /25.7

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

ఆర్‌అండ్‌బీ భూములు హాంఫట్

గద్వాలలో రూ.8 కోట్ల విలువైన స్థలాలు కబ్జా
- రోడ్ల కోసం సేకరించిన భూములపై అక్రమంగా పట్టా పాసుపుస్తకాలు
- గద్వాల – ఎర్రవల్లి, గద్వాల – అయిజ రహదారిలోని భూములు అన్యాక్రాంతం
- చక్రం తిప్పుతున్న ఓ రిటైర్డ్ లైబ్రేరియన్..
- రెవెన్యూ శాఖలోని కొందరు అధికారుల సహకారం



గద్వాల – ఎర్రవల్లి రహదారిలో కబ్జాకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలం

గద్వాల రూరల్: గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే రూ.కోట్లు విలువ చేసే పది శాతం స్థలాలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురై అన్యాక్రాంతం కాగా.. తాజాగా ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన రూ.కోట్లు విలువ చేసే భూములపై కొందరు కన్నేశారు. ఇష్టారీతిగా కబ్జా చేస్తూ.. రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. గద్వాల–ఎర్రవల్లి ప్రధాన రహదారి, అదేవిధంగా గద్వాల–అయిజ ప్రధాన రహదారి కోసం సుమారు 50ఏళ్ల కిందట ప్రభుత్వం భూసేకరణ చేసి రెండు ప్రధాన రహదారులను నిర్మించారు. అయితే రహదారులు నిర్మాణం చేసే క్రమంలో సేకరించిన భూములకు సంబంధించి వివరాలను రెవెన్యూ అధికారులు రికార్డులలో నమోదు చేయాల్సి ఉంది. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ అధికారులు సేకరించిన భూములకు సంరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ రెండు శాఖలకు చెందిన అధికారులు ఇవేవీ పట్టించుకోకపోవడంతో భూకబ్జాలకు పాల్పడే ముఠాకు ఇది వరంగా మారింది. రెవెన్యూ శాఖలో అవినీతికి అలవాటు పడిన కొందరు అధికారులను మచ్చిక చేసుకుని ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన భూములపై పాసుపుస్తకాలు సృష్టించి వాటిని బయట మార్కెట్‌లో దర్జాగా విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇటీవల రిటైర్డ్ అయిన ఓ విశ్రాంత లైబ్రేరియన్ ఉద్యోగి ఈ ముఠాలో కీలకపాత్ర పోషిస్తూ జేబులు నింపుకొనే పనిలో పడ్డాడు.

బీటీ రహదారుల కోసం భూసేకరణ

సుమారు 50ఏళ్ల కిందట ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు గద్వాల–ఎర్రవల్లి మధ్య మట్టి రోడ్డును ఇరువైపులా 100 ఫీట్ల రహదారిగా మార్చేందుకు నిర్ణయించారు. ఈమేరకు భూసేకరణ చేపట్టారు. ఇలా 100 ఫీట్ల వరకు సేకరించిన భూమిలో ఆర్‌అండ్‌బీ అధికారులు గద్వాల–ఎర్రవల్లి వరకు 50ఫీట్ల రోడ్డును నిర్మించారు. మిగిలిపోయిన భూమిని ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టకుండా అలాగే వదిలేశారు. దీంతో పాటు భూసేకరణ సమయంలో భూములు కోల్పోయిన యజమానుల పేర్లను రెవెన్యూ రికార్డులో తొలగించకుండా అలాగే వారిపేరు మీదుగానే వదిలిపెట్టేశారు. ఇక గద్వాల–అయిజ రహదారికి సంబంధించి కూడా ఇదే తరహాలో భూమి సేకరించి అందులో 30ఫీట్ల రోడ్డు నిర్మాణం చేసి మిగిలింది వదిలేశారు. వీటిపైనే ఓ ముఠా కన్ను పడింది.

గద్వాల – ఎర్రవల్లి రహదారి స్థలం అన్యాక్రాంతం

గద్వాల– ఎర్రవల్లి ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నంబర్ 341లో మొత్తం 2.01ఎకరాల భూమి ఉంది. ఇందులో 1.12ఎకరాలు నీలమ్మకు విక్రయించగా, మిగిలిన 1.32ఎకరాలను నాన్‌అగ్రికల్చర్‌గా కన్వర్ట్ చేసి 13మంది వ్యక్తులకు గజాల రూపంలో 8754.9గజాల(1.32ఎకరాలు)ను విక్రయించారు. ఇలా చేసిన వెంచర్‌లో 9గుంటల మేర భూమి ఆర్‌అండ్‌బీ రహదారి, వెంచర్‌కు సంబంధించిన అంతర్గత రహదారి(సీసీరోడ్డు) కోసం కేటాయించారు.ఈ భూమికి అధికారులు ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశారు. ఇలా వదిలేసిన 9గుంటల భూమి విలువ సుమారు రూ.2కోట్లపైనే ఉంటుంది.

చట్టపరమైన చర్యలు

ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన భూములు కబ్జా చేసి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. పూర్తి వివరాలు సేకరించి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– బీఎం సంతోష్, కలెక్టర్

యథేచ్ఛగా భూముల కబ్జా

రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూమి కొంత వృథాగా ఉండగా.. దాని ధర ప్రస్తుతం రూ.కోట్లలో పలుకుతోంది. ఈ స్థలాలపై భూదందాకు పాల్పడే ఓ ముఠా కన్నుపడింది. ఈముఠాకు లీడర్‌గా వ్యవహరిస్తున్న రిటైర్డ్ లైబ్రేరియన్ రెవెన్యూ శాఖలో తనకున్న పరిచయాలతో చక్రం తిప్పాడు. రెవెన్యూ శాఖలో అవినీతికి కొమ్ము కాసే అధికారుల సాయంతో గద్వాల–ఎర్రవల్లి రహదారిలో 21గుంటల భూమిని తన ముఠాలోని నలుగురు సభ్యుల పేరిట, అదేవిధంగా గద్వాల–అయిజ రహదారిలో ఉన్న 1.16ఎకరాలను అదే ముఠా పేరిట రెవెన్యూ రికార్డులో పేర్లు ఎక్కించి వారి పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించారు. వీటిని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.

ధరణిలో పాత భూ యజమానుల పేర్లు

సుమారు 65ఏళ్ల కింద కోల్పోయిన గద్వాల–ఎర్రవల్లి మధ్యనున్న 21గుంటలకు సంబంధించి గతంలో ఉన్న పాత భూయజమానుల పేర్లు ధరణిలో వచ్చాయి. ఈ 21గుంటల భూమి ధర ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.5కోట్లపైనే ఉంటుంది. అదేవిధంగా గద్వాల–అయిజకు వెళ్లే రహదారి పక్కనున్న సర్వే నంబర్ 871లో 1.20ఎకరాలకు సంబంధించి పాత భూయజమానుల పేర్లు ధరణిలో తెరమీదకు వచ్చాయి. దీని మార్కెట్ విలువ సుమారు రూ.3కోట్లుపైనే ఉంటుంది.

గద్వాల – అయిజ రహదారిలోనూ ఇదే దందా..

గద్వాల–అయిజ రహదారికి ఆనుకొని సర్వేనంబర్ 872లో 4.16గంటలు భూమి ఉంది. ఇందులో 1.20ఎకరాల భూమిని రహదారి నిర్మాణం కోసం 1959లో ఆర్‌అండ్‌బీ శాఖ భూసేకరణ చేసి 1.20ఎకరాలను స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించిన పరిహారం అప్పటి భూమి యజమాని అయిన గడ్డమీది భీమ్‌రెడ్డికి చెల్లించారు. ఇలా 4.16ఎకరాలలో 1.20 ఎకరాలు ఆర్‌అండ్‌బీ శాఖలోపోగా మిగిలిన భూమిని ఇతర ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. అయితే ఆర్‌అండ్‌బీ శాఖ పరిహారం చెల్లించి సేకరించిన 1.20ఎకరాలలో కొంతమేర రోడ్డు నిర్మాణం చేపట్టి మిగిలిన భూమిని ఖాళీగా వదిలేశారు. ఈ మిగిలిన భూమికి సంబంధించి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రికార్డు పరంగా ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధర రూ.కోట్లలో పలుకుతోంది.



గద్వాల – అయిజ రహదారి నిర్మాణంలో పరిహారం పొందిన వివరాలతో కూడిన రెవెన్యూ రికార్డు

పచ్చదనం.. పరిశుభ్రత ఎంతో అవసరం



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

- జిల్లాలో లక్ష్యం మేర మొక్కలు నాటాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్/గద్వాల: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి లక్ష్యం మేర మొక్కలు నాటి స్వచ్ఛతకు పాటుపడాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు రోజుల పాటు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సోమవారం జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాలు, గ్రామాలలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఒక ఉద్యమంలా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నిర్దేశిత లక్ష్యం చేరుకునేలా రోజువారీగా రూపొందించిన కార్యచరణ పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న బావిని పరిశీలించారు. పిచ్చి మొక్కలను తొలగించి, ఆకర్షణీయమైన మొక్కలను నాటాలని సూచించారు. గోడలకు కలరింగ్ చేయించి అందమైన పెయింటింగ్ వేయించాలన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వనంలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ నర్సింగ్ రావు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, మున్సిపల్ కమిషనర్ దశరథ్, చేనేత, జౌళి శాఖ అధికారి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అంగన్‌వాడీల నిర్వహణ

అంగన్‌వాడీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పెండింగ్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లో ఎంపిక చేసిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీలలో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల మౌళికసదుపాయాలు తాగునీరు, మరుగుదొడ్లు, వంటివి కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో సుధారాణి, ఈఈ శ్రీధర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార పుస్తకం ఆవిష్కరణ



సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ బీఎం సంతోష్

జిల్లాలోని అన్ని రకాల సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించి ఎంతో పకడ్బందీగా జిల్లా సమాచార పుస్తకాన్ని రూపొందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్, జెడ్పీ సీఈవో కాంతమ్మ, సీపీవో లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు మాఫీ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల రూరల్: అలంపూర్, గద్వాల నియోజకవర్గాల పరిధిలోని రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ బ్యాంకులలో తీసుకున్న రుణాలను సైతం ప్రభుత్వం మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్ వద్దకు రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాలలోని రైతులు పంటల సాగుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లోని బ్యాంకులలో లోన్లు తీసుకున్నారని, అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేయాలన్నారు. అనంతరం వారు కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాసు హనుమంతు, కుర్వ పల్లయ్య, తిరుమల్, ఆత్మలింగారెడ్డి, బస్వరాజు, మస్తాన్, తిరుమల్, పల్లెపాడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డీపీఓ, డీఆర్‌డీఓ బదిలీలు

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీశాఖ అధికారిగా ఎం.వీ రామ్మోహన్ రావును ప్రభుత్వం సోమవారం నియమించింది. నల్లగొండ జిల్లా దేవరకొండ డీఎల్పీఓగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లాకు బదిలీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో డీపీఓగా పనిచేస్తున్న పి. కృష్ణయ్య నారాయణపేట జిల్లాకు బదిలీ అయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా డీపీఓగా కల్వకుర్తి డీఎల్పీఓగా పనిచేస్తున్న బి. శ్యాంసుందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. నారాయణపేట డీఆర్డీఓగా మొగులప్పను ప్రభుత్వం నియమించింది. జనగామ డీఆర్డీఓగా పని చేస్తున్న ఆయన నారాయణపేటకు రానున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

వేరుశనగ క్వింటా రూ.6,614

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 1182 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6614, కనిష్టం రూ.2800, సరాసరి రూ.4860 ధరలు పలికాయి. అలాగే, 4 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5260, కనిష్టం రూ. 5160, సరాసరి రూ. 5260 ధరలు లభించాయి.

ప్రజావాణికి 28 ఫిర్యాదులు

గద్వాల రూరల్: పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 28ఫిర్యాదులు వచ్చినట్లు వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు ప్రతి ఫిర్యాదుదారునికి పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అందుకు సంబంధించిన కారణాలను వివరిస్తూ ఫిర్యాదుదారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్ పంపాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 12 అర్జీలు

గద్వాల క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 12 అర్జీలు అందాయని ఏఎస్పీ గుణశేఖర్ తెలిపారు. ఇందులో 8 భూ సంబంధ, ఒకటి పంట ధ్వంసం, మిస్సింగ్ కేసు, ఇతరాత్ర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. భూ తగదాలకు సంబంధించిన వాటిని కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిందిగా బాధితులు తెలియజేశారు.

జిల్లా ఎక్సైజ్ అధికారి బదిలీ..?

గద్వాల క్రైం: 'కరవమంటే కప్పకి కోపం.. విడవమంటే పాముకి కోపం' అన్న చందంగా తయారైంది జిల్లాలోని ఓ పార్టీకి చెందిన రెండు వర్గాల తీరు. ఒకే పార్టీకి చెందిన ఈ రెండు వర్గాలు.. ఒకరేమో తాము చెప్పిన వారు కల్లు విక్రయాలు చేస్తారని.. చూసీచూడనట్లు ఉండాలని సూచిస్తుండగా.. మరో వర్గానికి చెందిన వారు కల్తీ కల్లు తయారీదారులపై చర్యలు తీసుకోవాలని.. అనుమతి లేని దుకాణాలపై దాడులు చేయాలని ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారికి ఏం చేయాలో తెలియక.. వచ్చిన నాలుగు నెలలకే వ్యక్తిగత సెలవుపై వెళ్లి అటు నుంచి అటే బదిలీపై వెళ్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ్‌కుమార్ పది రోజుల క్రితం వ్యక్తిగత సెలవులపై వెళ్లి నేటికీ బాధ్యతలు స్వీకరించలేదు. ఈక్రమంలో జిల్లా ఎక్సైజ్ ఇన్‌చార్జ్ అధికారిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయ్‌భాస్కర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు రావడం చర్చనీయాంశమైంది. ప్రధానంగా గీత కార్మికులకు లైసెన్స్‌ల జారీ, అనుమతి లేని కల్లు దుకాణాలు, డిపో ఏర్పాటు విషయమై జిల్లాలోని ఓ పార్టీకి చెందిన ఒక వర్గంపై మరో వర్గం వారు ఎక్సైజ్ శాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని సమాచారం. ఈక్రమంలోనే అనుమతి లేని కల్లు డిపోపై నార్కోటిక్ అధికారులు దాడి, కొందరిపై కేసు నమోదు చేశారు. దీంతో ఒకే పార్టీలోని ఇరు వర్గాల మధ్య వివాదం రేగింది.


నాయకుల ఒత్తిడి..

మా పార్టీ అధికారంలో ఉందని.. మేం చెప్పిన వారికే కల్లు దుకాణాల లైసెన్స్‌లు ఇవ్వాల్సిందిగా ఓ వర్గంవారు జిల్లా ఎక్సైజ్ అధికారిపై ఒత్తిడి చేయడంతో విధుల నిర్వహణకు సమస్యగా మారిందని సమాచారం. చివరికి వ్యక్తిగత సెలవుపై జిల్లా ఎక్సైజ్ అధికారి వెళ్లినట్లు తెలిసింది. బదిలీ విషయమై జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. వ్యక్తిగత సెలవులో ఉన్నానని, మా శాఖపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆయన అన్నారు.

'రుణమాఫీ'లో చిక్కుముడులు

ఒక్కొక్కరిది ఒక్కో సమస్య

■ గండేడ్ మండలం చిన్నవార్వాల్ గ్రామానికి చెందిన దాసరి బుగ్గయ్యకు 2.29 ఎకరాల భూమి ఉంది. 2020 వెన్నాచేడ్ ఎస్‌బీఐలో పంట రుణం కింద రూ.80 వేలు తీసుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రూ.30 వేలు మాఫీ కాగా.. మిగతా రూ.50 వేల అప్పు అలాగే ఉంది. ప్రస్తుతం అది రూ.58,756 అయింది. అతడి కుమారుడు దాసరి రాములుకు 33 గుంటల భూమి ఉండగా.. 2023 ఫిబ్రవరి అదే బ్యాంక్‌లో పంట రుణం రూ.30 వేలు తీసుకున్నాడు. వడ్డీతో కలిపి రూ.31,305 అయింది. ఆ ఇద్దరివి కలిపి కట్టాల్సినవి రూ.లక్ష లేపే. కానీ ఇద్దరి పేర్లు రుణమాఫీ లిస్టులో లేవు. దీంతో వారు బ్యాంక్, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగారు. చివరకు ఆధార్, రుణ ఖాతాల్లోని పేర్లు వేర్వేరుగా ఉన్నాయని ఏఈఓ చెప్పారు. అతడి కుటుంబంలో పంట రుణం తీసుకుంది ఇద్దరే కాగా.. ముగ్గురి పేర్లు చూపిస్తున్నాయి. ఈ మూడో వ్యక్తి మేడ్చల్ జిల్లాకు చెందిన బాల్‌రాజ్ పేరిట డీసీసీబీ ఖాతా నంబరుతో ఉంది. అతనికి, దాసరి బుగ్గయ్య కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. దీంతో బుగ్గయ్య తలపట్టుకుని.. తప్పులను సరి చేసి, మాకు రుణమాఫీ జరిగేలా చూడాలని వేడుకున్నాడు.



వ్యవసాయశాఖ వివరాల్లో బుగ్గయ్య కుటుంబానికి సంబంధంలేని బాల్‌రాజ్ పేరు వచ్చిన దృశ్యం (రెండో పేరు)



■ ఈ ఫొటోలోని రైతు పేరు గొర్యానాయక్. మహమ్మదాబాద్ మండలం శేకర్ల తండాకు చెందిన ఆయన నంచర్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏడాది క్రితం పంట రుణం కింద రూ.లక్ష తీసుకున్నాడు. అది ఇప్పుడు రూ. 1.39 లక్షలు అయింది. లక్ష రూపాయల రుణమాఫీ జాబితాలో అతడి పేరు వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లి చూడగా రూ.19వేలు మాత్రమే పడ్డాయి. బ్యాంకు అధికారులను అడిగితే దాని గురించి తెలియదని.. వ్యవసాయాధికారులను అడగండని చెప్పారు. ఇలా ఎందుకైందని అడిగితే ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

..రుణమాఫీలో చోటుచేసుకున్న తప్పిదాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.లక్ష, రూ.1.50 లక్షల పంట రుణాలు మాఫీ చేసిన విషయం తెలిసిందే. రెండు విడతల్లో కలిపి వెల్లడైన జాబితాల్లో అర్హులైన వేలాది మంది రైతుల పేర్లు గల్లంతు కాగా.. వారు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ నిత్య ప్రదక్షిణలు చేస్తున్నారు. వారు పైనుంచే మాకు జాబితా వచ్చినట్లు చెబుతుండడంతో పలుచోట్ల అన్నదాతల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు రూపొందించిన తప్పుల తడక జాబితాలతో తమకు నష్టం వాటిల్లిందంటూ తాజాగా సోమవారం గండీడ్ మండల రైతులు ఆందోళనకు దిగారు. పీఏసీఎస్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రుణ మాఫీ చిక్కుముడులపై 'సాక్షి' ఫోకస్..
– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఇప్పటివరకు 2 విడతల్లో రూ.1.50 లక్షలలోపు మాఫీ
- జాబితాల్లో అర్హులైన వేలాది మంది రైతుల పేర్లు గల్లంతు
- బ్యాంకర్లు, వ్యవసాయాధికారుల చుట్టూ నిత్య ప్రదక్షిణలు
- అధికారుల తప్పిదాలతో నష్టపోవాల్సి వస్తోందని అన్నదాతల ఆవేదన
- పలుచోట్ల పెల్లుబికుతున్న ఆగ్రహావేశాలు.. గండేడ్ పీఏసీఎస్‌కు తాళం
- పైనుంచే లిస్ట్ వచ్చిందని తప్పించుకుంటున్న అధికారులు



అయిజ ఎస్‌బీఐలో రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు బారులు తీరిన రైతులు

3,076 మందిలో 1,130 మందికే మాఫీ..

ఉమ్మడి గండేడ్ మండల పరిధిలో 49 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహమ్మదాబాద్, వెన్నాచేడ్ , వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి, గండేడ్, చిన్నవార్వాల్, గాధిర్యాల్, నంచర్ల తదితర గ్రామాలకు చెందిన సభ్యత్వం గల రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మొత్తం 3,212 మంది రైతులు సుమారు రూ.11.78 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్ష లోపు 2907 మంది రైతులు రూ.7.28 కోట్ల రుణం తీసుకోగా.. 1,059 మంది రైతులకు రూ.2.73 కోట్ల మాఫీ వచ్చింది. ఇంకా 1,848 మంది రైతులకు సంబంధించి రూ.4.55 కోట్లు మాఫీ కాలేదు. అదేవిధంగా రూ.1.50 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు 169 మంది ఉన్నారు. వీరికి రూ.1.95 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ 71 మంది రైతులకు రూ. 80.05 లక్షలు మాత్రమే మాఫీ అయినట్లు జాబితా వచ్చింది. 98 మంది రైతులకు రూ.1.15 కోట్లు మాఫీ కాలేదు. రూ.2 లక్షల లోపు రుణాలకు సంబంధించి రూ.2.44 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నట్లు పీఏసీఎస్ రికార్డులు చెబుతున్నాయి. ఇప్పటివరకు రెండు విడతలుగా వెల్లడైన జాబితా ప్రకారం సగం మందికి పైగా రైతులు రుణమాఫీకి నోచుకోలేదని స్పష్టమవుతోంది. ఇదే పరిస్థితి డీసీసీబీ పరిధిలోని అన్ని బ్రాంచ్‌లలో నెలకొన్నట్లు తెలుస్తోంది.

రుణం తీసుకోకుండానే మాఫీలో పేరట..!


గండేడ్ మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో విచిత్ర పరిస్థితి ఆలస్యంగా వెలుగుచూసింది. పంట రుణం తీసుకోని రైతులకూ మాఫీ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం చోటుచేసుకున్న సంఘటన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైరల్‌గా మారింది. ఇప్పటివరకు రెండు విడతలుగా రూ.1.50 లక్షల లోపు రుణమాఫీ అయిన జాబితాను పీఏసీఎస్ గోడపై అతికించారు. చాలా మంది రైతులు వచ్చి జాబితాలో పేరుందా.. లేదా.. అని చూసుకుని వెళ్లారు. ఈ క్రమంలో తాము రుణం తీసుకోకుండానే మాఫీ జాబితాలో పేరు రావడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న సీఈఓ ఆశన్నతో పాటు పీఏసీఎస్ సిబ్బందిని నిలదీశారు. మాఫీ వచ్చినా వేలకు వేలు వడ్డీ కట్టమంటున్నారని మరికొందరు వాగ్వాదానికి దిగారు. పీఏసీఎస్ గదికి తాళం వేసి.. సిబ్బందిని నిర్బంధించారు. కొందరు రెన్యూవల్ చేయకపోవడంతో వారు తీసుకున్న రుణం కంటే వడ్డీ ఎక్కువైందని.. అంతేకాకుండా ప్రభుత్వం 2023 డిసెంబర్ 10 వరకు మాత్రమే మాఫీ ఇవ్వడం మూలంగా అప్పటి నుంచి ఇప్పటివరకు వడ్డీ కట్టాల్సిందేనని సీఈఓ ఆశన్న తెలిపారు.

రూ.16వేలే జమ అయ్యాయి..



మా నాన్న పేరు జే.అబ్దుల్ సత్తార్. నాన్న పేరు మీద 3 ఎకరాల పొలం ఉంది. ఆయన చనిపోయి ఆరు నెలలు అవుతోంది. ధరూరు ఏపీజీవీ బ్యాంకు నందు పంట రుణం రూ.94వేలు తీసుకున్నాం. మాకు రుణమాఫీ మొత్తం కావాల్సి ఉండగా... కేవలం 16వేలు మాత్రమే అకౌంట్‌లో జమ అయ్యాయి. బ్యాంకు వాళ్లను, వ్యవసాయ శాఖ అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. మేము ముగ్గురం అన్నదమ్ములం. రైతు రుణమాఫీలో మాకు న్యాయం జరగలేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. అందరి రుణాలు పూర్తిగా మాఫీ చేసి మాకు మాత్రం అన్యాయం చేశారు. జిల్లా అధికారులు స్పందించి ఆదుకోవాలి.
– ఇబ్రహీం, ధరూరు

తప్పు ఎవరిదో తెలియట్లే..



మాకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలం మీద రూ.లక్ష పంట రుణం తీసుకున్నాం. యేటా రెన్యూవల్ చేసుకున్నాం. అన్ని అర్హతలు ఉన్నా.. మాకు రుణమాఫీ వర్తించలేదు. రూ.లక్ష రుణం ఉంటే కేవలం రూ.3,890 మాత్రమే మాఫీ అయ్యింది. బ్యాంకుకు వెళ్లి అడగగా.. ఈ విషయం బయటపడింది. అసలు తప్పెవరిదో తెలియడంలేదు. బ్యాంకు వాళ్లను అడిగితే మాకు తెలియదు అంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే జిరాక్స్‌లు తీసుకురండి మళ్లీ పంపుదాం అంటున్నారు. లోపం ఎక్కడ జరిగిందో కానీ మాకు రుణమాఫీ వర్తించ లేదు.
– సర్వేశ్వర్‌రెడ్డి, రైతు, ధరూరు

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


నల్లవెల్లి స్వామి (ఫైల్)

కోడేరు: మండలంలోని ఎత్తంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన నల్లవెల్లి స్వామి (28) ఉదయం తన పొలంలో వరి చేనుకు నీరు పారించడానికి వెళ్లాడు. తన మోటారు నడవకపోవడంతో గ్రామ శివారులో మద్దూరి వెంకటస్వామి మామిడితోటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బ్రేకర్ ఆన్ చేయడానికి వెళ్లగా, సమీపంలోనే 11 కేవీ విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


దేవరాజు (ఫైల్)

గోపాల్‌పేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన గోవిందుకు ఇద్దరు కుమారులు ఉండగా వారికి పెళ్లిళ్లు అయ్యాయి. పొలం, బోరు పంపకాల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురై జులై 7వ తేదీన గోవిందు చిన్నకుమారుడు దేవరాజు (43) పొలం వద్ద గడ్డి మందు తాగాడు. గమనించిన భార్య అతడిని వెంటనే వనపర్తికి అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సోమవారం దేవరాజు ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలోపడి మహిళ..

- దుస్తులు ఉతికేందుకు వెళ్లగా ఘటన

మల్దకల్ : దుస్తులు ఉతికేందుకు వెళ్లి ఓ మహిళ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దొడ్డికి చెందిన మహదేవమ్మ (52) భర్త ఊరబావి రఘుపతిరెడ్డి తమకు ఉన్న వ్యవసాయ పొలంలో పంటను సాగుచేసుకుంటూ జీవనం సాగించేవారు. మహదేవమ్మ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలిగా కొంతకాలం నుంచి పనిచేస్తోంది. కాగా సోమవారం ఉదయం ఇంటి ముందు ఉన్న కాల్వలో దుస్తులు ఉతికేందుకు వెళ్లి అందులో జారిపడింది. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహదేవమ్మకు భర్తతో పాటు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మృతదేహం లభ్యం

వెల్దండ: జోద్యనాయక్ తండా సమీపంలో పోతేపల్లి-బొల్లంపల్లి బీటీరోడ్డు పక్కన సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (65) మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. తండావాసుల కథనం ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి కొన్ని రోజులుగా తండాల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవించేవాడు. నాలుగు రోజుల క్రితం తండాలోనూ భిక్షాటన చేశాడు. కాగా రెండు రోజుల నుంచి రోడ్డు పక్కన ఉన్న మిషన్‌భగీరథ గేట్ వాల్వ్ వద్ద నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల రైతులు వెళ్లి పరిశీలించగా.. సదరు వ్యక్తి మృతదేహం కనిపించింది. కాగా నీరు తాగే ప్రయత్నంలో అతడు కిందపడి మృతి చెంది ఉంటాడని పేర్కొన్నారు. విషయంపై సమాచారం ఇవ్వగా ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని అల్లంతోట కార్యదర్శి నందకిశోర్‌కు అప్పగించారు. కాగా గారమస్తులతో కలిసి ఎంజీతండాలో అతడి అంత్యక్రియలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నందకిశోర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలిసిన వారికి మెసేజ్ చేసి..వ్యక్తి ఆత్మహత్య

వనపర్తి: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, చిమనగుంటపల్లికి చెందిన ఉదయ్‌కుమార్ (37) సోమవారం జిల్లా కేంద్రంలో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం .. జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి ఆయన జీవించేవారు. ఓ ప్రైవేటు బ్యాంకులో రుణాలు ఇప్పించే మార్కెటింగ్ జాబ్ చేసేవారు. కాగా తాను వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకున్న ఆఫీస్‌లో ఉరి వేసుకుంటున్నట్లుగా ఆయన తెలిసిన వారికి మెసేజ్ చేశారు. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకుని చూడగా..డోర్‌మూసి ఉండటంతో సమీపంలో పని చేసుకునే వారి సాయంతో దానిని పగులగొట్టి లోపలకు వెళ్లారు. ఆయనను జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని ఎస్ఐ రామరాజు తెలిపారు. ఆయన తండ్రి బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



గద్వాలకు చెందిన చేనేత కార్మికుడు బావండ్ల వెంకటేష్ సాంకేతితను ఉపయోగించి విభిన్నమైన డిజైన్‌తో గద్వాల పట్టు చీరను నేసి పురస్కారాల పోటీకి పంపారు. చంద్రనికో నూలు పోగు అనే కాన్సెప్ట్‌ను అనుసరించి పట్టుచీర నేశారు. మహిళలు నూలు పోగులు చందమామకు సమర్పిస్తున్న డిజైన్‌తో చీర కొంగును రూపొందించారు. అంతేగాక చందమామను స్తుతిస్తూ మరాఠీలో రాసిన కీర్తనలు పొందుపర్చడం మరో ప్రత్యేకత. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త వినయ్ నర్కార్ కోరిక మేరకు ఈ చీరను నేశారు. గత 30 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అతడు.. రాష్ట్ర పురస్కారానికి ఎంపికయ్యారు.



గద్వాల జిల్లా గొర్లఖాన్‌దొడ్డికి చెందిన చేనేత కార్మికుడు గడిగే మునెప్ప కళాత్మకతను రంగరించి వినూత్నంగా వివిధ రకాల చీరలు రూపొందించడంలో ప్రావీణ్యుడు. వైవిధ్యమైన గద్వాల చీరలను నేయడంతో పాటు సంప్రదాయ రంగులతో చీరలను నేసి అబ్బురపరిచారు. మూడు తరాల నుంచి వారి కుటుంబ సభ్యులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మూడు రకాల గొల్లభామలతో కూడిన అద్భుతమైన డిజైన్‌లతో పట్టుచీరని నేసి, అందరి మన్ననలు పొందారు. అందులో భరతనాట్యం, అద్దం చూసుకోవడం, కూర్చొని ఉండటం వంటి భంగిమలతో కూడిన గొల్లభామల డిజైనింగ్‌తో చీరను కళాత్మకంగా రూపుదిద్దారు. తొలిసారిగా రాష్ట్ర పురస్కారానికి ఎంపికయ్యారు.

నేతన్న కళారూపానికి గౌరవం



అమచింతలో జరీ చీరల తయారీలో నేతన్న దంపతులు, రాష్ట్ర పురస్కారానికి ఎంపికైన బావండ్ల వెంకటేష్ నేసిన పట్టు చీర

ఉమ్మడి జిల్లాలో 5 మంది కార్మికులకు రాష్ట్ర పురస్కారం

గద్వాల/అమరచింత: ఒక్కో పోగు జత చేసి, కళాత్మకతతో వస్త్రంగా మార్చే నేతన్న కష్టం అసామాన్యం. ఆ శ్రమ వెనుక ఎన్నో ఒడిదుడుకులు దాగి ఉన్నాయి. దశాబ్దాలుగా వస్త్రాలపై వివిధ కళాకృతులను తీర్చిదిద్దుతూ ఔరా అనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళీశాఖ ఆధ్వర్యంలో అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 5 మంది కార్మికులు ఎంపికయ్యారు. వీరిలో గద్వాల జిల్లా నుంచి ఇద్దరు, వనపర్తి జిల్లా నుంచి ముగ్గురు చేనేత కార్మికులు ఉన్నారు. వీరికి ఈ నెల 7వ తేదిన హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పురస్కారం అందించనున్నారు. రూ. 25 వేల నగదు, శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రంతో సత్కరించనున్నారు.

వృత్తికి గౌరవం దక్కింది..



45 సంవత్సరాలుగా చేనేత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. చేనేత వృత్తి కి ఆదరణ సన్నగిల్లినా.. ఆశించిన ధరలు రాకపోయినా జరీ చీరల తయారీపైనే ఆధారపడ్డా. తన వృత్తికి గౌరవిస్తూ రాష్ట్ర పురస్కారానికి ఎంపిక చేయడం సంతోషంగా ఉంది.
– పెరుమాళ్ల సత్యన్న, తిపుడంపల్లి

సంతోషంగా ఉంది..




18 ఏళ్ల నుంచి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా. కుటుంబం మొత్తానికి చేనేతనే జీవనాధారం. నా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందని జౌళీ శాఖ అధికారులు చెప్పడం సంతోషంగా ఉంది.
– గాజుల వెంకటేష్, అమరచింత

గర్వంగా ఉంది..



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి రోజున రాష్ట్రస్థాయి చేనేత పురస్కారం అందుకుంటుండటం ఎంతో సంతోషం ఉంది. 30 ఏళ్లుగా మగ్గంపై ఆధారపడి పట్టు చీరలు నేస్తున్నాను. ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ, ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వృత్తిలో నైపుణ్య పెంచుకుంటూ, కొత్త డిజైన్‌లో జరీ చీరలను తయారుచేస్తున్నా.
– చిన్న సీతారాములు, అమరచింత

జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో


నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 2.60లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 2.65లక్షల క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు 36 క్రస్టుగేట్లను ఎత్తి 2,47,204 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 68, కుడి కాల్వ ద్వారా 704, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,74,071 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.790 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 2,91,028 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 80.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.10లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 25 గేట్లను ఎత్తి 1,89,700 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 27.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

80 ఎం.యూ. విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 80 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు జెన్‌కో ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. సోమవారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టారు. జూరాలకు అత్యధికంగా వరద చేరుతున్న నేపథ్యంలో దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండడంతో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోతున్నామని తెలిపారు.

సుంకేసులకు స్వల్పంగా తగ్గిన వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో సోమవారం స్వల్పంగా తగ్గింది. ఆదివారం 28 గేట్ల ద్వారా నీటి విడుదల కాగా, సోమవారం అధికారులు 5 గేట్లను మూసి 23 గేట్ల ద్వారానే నీటి విడుదల చేశారు. ఎగువ నుంచి 1.04లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 23 గేట్ల ద్వారా 99,153 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసి, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

అధికవడ్డీ ఆశజూపి మోసం చేశారని ఫిర్యాదు


ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నాగర్‌కర్నూల్ క్రైం: అధికవడ్డీ ఆశజూపి నగదును ఇవ్వకుండా మోసం చేశారని ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్‌కు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన జహీర్ అలియాస్ చోటోమియా సొంత గ్రామంలో, నాగర్‌కర్నూల్, తూడుకుర్తి చెందిన దాదాపు 150మంది వరకు అధికవడ్డీ ఆశ చూపడంతో రూ.10కోట్ల వరకు అతడికి వడ్డీకి ఇచ్చారు. కొద్దిరోజులు నెల, నెలా వడ్డీ చెల్లిస్తూ వారిలో నమ్మకం కలిగించాడు. బాధితులకు అసలుతో పాటు వడ్డీ డబ్బులు ఇవ్వకుండా పరారవడంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. తమ డబ్బును ఇప్పించి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేజీబీవీ ఘటనపై కలెక్టర్ ఆగ్రహం


పెంట్లవెల్లి కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బాధ్యులపై చర్యలకు ఆదేశం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజనం వికటించి, విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై కలెక్టర్ బదావత్ సంతోష్ సీరియస్ అయ్యారు. సోమవారం కేజీబీవీలో తనిఖీలు చేపట్టారు. భోజనశాల, స్టోర్‌రూం, వంటగదిలోని కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థినులు వాంతులు, విరేచనాలకు గురికావడానికి గల కారణాలు తెలుసుకొని నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. బాధ్యులైన కేజీబీవీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు వంట సిబ్బందిని మార్చాలని డీఈఓను ఆదేశించారు. విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. రోజు వారీగా తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులతో భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో ప్రతి తరగతి గదిని పరిశీలించారు. 9, 10 తరగతుల విద్యార్థినులతో మాట్లాడి, సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు ఫోన్ నంబర్ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

- కేజీబీవీలో దాదాపు 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో సోమవారం విద్యార్థి సంఘాలు, బీజేపీ నాయకులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. కేజీబీవీ హాస్టల్ ఎదుట బైఠాయించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న కలెక్టర్.. విద్యార్థినుల తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. కలెక్టర్ వెంట డీఈఓ గోవిందరాజులు, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఆర్డీఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

శెభాష్.. జ్ఞానవర్షిణి

- ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి
- ఏఈఈ, టీపీబీఓతోపాటు మరో రెండు గ్రూప్–4 ఉద్యోగాలు
- వెల్లువెత్తుతున్న అభినందనలు.. సంతోషంలో కుటుంబికులు


కుటుంబీకులతో జ్ఞానవర్షిణి

మహమ్మదాబాద్: రేయింబవళ్లు కష్టపడి.. ఎన్నో లక్షలు ఖర్చుపెట్టుకుని చదివినా.. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం దక్కని నేటి రోజుల్లో ఓ యువతి ఏకంగా ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించుకుంటుంది. మహమ్మదాబాద్ మండలంలోని దేశాయిపల్లికి చెందిన జ్ఞానేశ్వరి, రాజిరెడ్డి దంపతుల కుమార్తె జ్ఞానవర్షిణి గతేడాది సివిల్ ఇంజినీర్ పరీక్ష రాశారు. ఇందులో మొత్తం 1,154 పోస్టులకు గాను 3,400 మంది పోటీ పడగా జ్ఞానవర్షిణి మహిళా విభాగంలో 20వ ర్యాంకు సాధించింది. ఇటీవల వచ్చిన టీజీపీఎస్సీ ఫలితాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ (జీహెచ్‌ఎంసీ)లో ఎంపికైంది. అలాగే టీపీబీఓ టౌన్ ప్లానింగ్ అధికారి ఉద్యోగంతోపాటు గ్రూప్–4లో మరో రెండు ఉద్యోగాలు సాధించింది. కాగా ఈమె అన్న ప్రవీణ్‌రెడ్డి సైతం రెండేళ్ల క్రితం నౌకాదళంలో లెఫ్టినెంట్ ఆఫీసర్‌గా మొదటి ప్రయత్నంలోనే ఎంపికవడం విశేషం. ఈ విషయమై తల్లిదండ్రులు స్పందిస్తూ తమ ఇద్దరు సంతానం కుమారుడు, కూతురు ఉన్నత ఉద్యోగాలు పొందడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన జ్ఞానవర్షిణిని గ్రామస్తులు అభినందించారు.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం..

ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాల్లో ప్రజలకు సేవ చేసే ఉద్యోగమంటే ఎంతో ఇష్టం. ఏఈఈ ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తాను. ఇన్ని ఉద్యోగాలు సాధించడంలో నా తల్లిదండ్రులు, కుటుంబీకులు, గురువుల పాత్ర ఎంతో ఉంది. వారందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటా. నాకు ఇష్టమైన ఏఈఈ ఉద్యోగం చేస్తూ.. మిగతా ఉద్యోగాలకు రాజీనామా చేస్తాను.
– జ్ఞానవర్షిణి, దేశాయిపల్లి, మహమ్మదాబాద్ మండలం

మూడు ఉద్యోగాలు సాధించిన చంద్రకాంత్



జడ్చర్ల: పట్టణానికి చెందిన యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. జె.చంద్రకాంత్ టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈఈగా, భూగర్భ జల శాఖలో ఏఈగా ఎంపికయ్యాడు. వీటితోపాటు గ్రూప్–4లో సైతం మెరిట్ సాధించి ప్రతిభచాటాడు. చంద్రకాంత్ తండ్రి గోపాల్ స్థానికంగా రాఘవేంద్ర హెయిర్ సెలూన్ నిర్వహిస్తుండగా.. తల్లి విజయలక్ష్మి నవాబ్‌పేట మండలం కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. భవిష్యత్‌లో ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని చంద్రకాంత్ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

కోస్గి: జల్సాలకు అలవాటు పడ్డ యువకులు రద్దీగా ఉండే ప్రదేశాలను ఎంపిక చేసుకుని అదును చూసి విలువైన సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లడం వృత్తిగా ఎంచుకున్నారు. వారిని పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా అసలు నిజం బయటపడింది. ఇందుకు సంబంధించి డీఎస్పీ లింగయ్య సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా డోన్, ఎమ్మిగనూర్ ప్రాంతాలకు చెందిన ఎల్లప్ప, అరవింద్ సులువుగా డబ్బు సంపాదించేందుకు సెల్‌ఫోన్ దొంగతనాలను ఎంచుకున్నారు. వీరిపై నిజామాబాద్, కామారెడ్డి, కేశంపేట, సైబరాబాద్, జడ్చర్ల, మహబూబ్‌నగర్–1 టౌన్, కరీంనగర్–1 టౌన్, కొడంగల్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కాగా ఈ నెల 1 నుంచి వరుసగా కోస్గి బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయి. సారంగరావుపల్లికి చెందిన బుజ్జి అనే మహిళా తన విలువైన సెల్‌ఫోన్ పోయినట్లు ఈ నెల 2 ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం బ్రాంచ్ పోలీసులు మఫ్టీలో ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఈ నెల 4న ఓ ఆటోలో బస్టాండ్‌లోకి వచ్చిన వీరిద్దరి కదలికలు అనుమానస్పదంగా ఉండటంతో పోలీసులు పట్టుకుని విచారించారు. పోలీసుల దర్యాప్తులో అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగలుగా గుర్తించారు. వీరి నుంచి రూ.2.5 లక్షల విలువైన 7 సెల్‌ఫోన్‌లను, ఆటోను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం....రాచాల గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్ స్నేహ చికెన్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కొన్నాళ్ల నుంచి కుటుంబంతో కలిసి అత్తగారి ఊరు శాఖాపూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి స్నేహ కంపెనీలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా శాఖాపూర్ యూటర్న్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు వదిలినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

కంపచెట్లలో పడి వ్యక్తి..

మక్తల్: పట్టణానికి చెందిన ఎండీ పాష(55) సమీపంలో ఉన్న కెనాల్‌వద్ద కంపచెట్లలో పడి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సదరు వ్యక్తి ఓ ఫంక్షన్ హాల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కాగా కాల్వ దగ్గర కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అక్కడే పడి మృతిచెందాడు. అయితే అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని.. అందువల్లే అక్కడ కిందపడి ఉంటాడని స్థానికులు తెలిపారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శోకసంద్రంలో మొగులమడ్క

- నాసిక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వలస కూలీల దుర్మరణం
- పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాలు
- మృతదేహాలు స్వగ్రామానికి తరలింపు


పాపరాజు ఇంటి వద్ద కూర్చున్న బంధువులు

దామరగిద్ద: బతుకుదెరువు కోసం ఉన్న ఊరును వదిలి మహారాష్ట్రలోని నాసిక్‌కు వెళ్లిన మొగులమడ్కకు చెందిన ముగ్గురు కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషాద ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మొగులప్ప, వెంకటప్ప, పాపరాజుతో పాటు ఇదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు శేఖర్, మహిపాల్, రాజు బతుకుదెరువు కోసం మహారాష్ట్రకు వెళ్లి కొన్నేళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్నారు. రోజులాగే ఆదివారం పట్టణంలోని వాణిలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనుల ప్రదేశానికి మొగులప్ప కారులో ఆరుగురు కూలీలు బయలుదేరారు. పని ముగిసిన తర్వాత తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మొగులప్ప (31), వెంకటప్ప (33), పాపరాజు (25) అక్కడికక్కడే మృతిచెందారు. మహిపాల్‌కు చెయ్యి, కాలు విరగగా.. శేఖర్, రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న అక్కడి పోలీసులు మృతదేహాలను నాసిక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో స్వగ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు. మంగళవారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకోనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

- మొగులప్ప భార్య లక్ష్మి, తండ్రి నాగప్పతో కలిసి నాసిక్‌లో ఉంటుండగా.. తల్లి మణెమ్మతో పాటు మొగులప్ప ఇద్దరు కుమారులు గ్రామంలోనే ఉంటున్నారు.
- వెంకటప్ప భార్య సునీతతో నాసిక్‌కు వెళ్లగా.. అతడి ఇద్దరు కుమారులు గ్రామంలోని అత్తగారి ఇంట్లో ఉంటున్నారు.
- పాపరాజు అన్న హన్మంతు, వదినతో కలిసి వలస వెళ్లాడు. ఇటీవల గ్రామానికి రాగా ఆయన అక్క తన కూతురిని ఇచ్చి వివాహం జరిపించాలని నిర్ణయించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో పాపరాజు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మాగనూర్: మండలంలోని నేరడగంలో దివ్యాంగురాలు వడ్డే వెంకటమ్మ చెందిన ఇల్లు షార్ట్ షర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో, గమనించిన చుట్టుపక్కల వారు ఆమెకు సమాచారం ఆందించారు. ఆమె ఇంటికి చేరుకుని తాళం తెరిచి చూడగా అప్పటికే మొత్తం కాలిబూడిద అయ్యింది. సుమారుగా రూ. 3.50లక్షల వరకు ఆస్తినష్టం వాటినట్లు ఆమె వాపోయారు. దివ్యాంగురాలైన వడ్డే వెంకటమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


కాలిపోయిన వస్తువులను చూయిస్తున్న వడ్డే వెంకటమ్మ